www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

## ఛత్తీస్ గఢ్ లో మరో ఎన్ కౌంటర్...

# నలుగురు మావోల మృతి

**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**
ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు. మృతులపై మొత్తం రూ. 17 లక్షల రివార్డు ఉంది. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ దళాలు బాసగూడ, గంగలూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దక్షిణపశ్చిమ కారిడార్‌లో మావోయిస్టుల కార్యకలాపాలపై నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు ఆపరేషన్ ప్రారంభించాయి. నిన్న సాయంత్రం ప్రారంభమైన కాల్పులు రాత్రంతా అడపాదడపా కొనసాగాయి. మృతి చెందిన మావోయిస్టులను హుంగా, లక్కె, భీమే, నిహాల్ అలియాస్ రాహుల్ గా గుర్తించారు. వీరంతా నిషేధిత సీపీఐ (మావోయిస్టు) సౌత్ సబ్ జోనల్ బ్యూరోకు చెందినవారని అధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి భద్రతా సిబ్బంది భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఒక ఇన్‌సాస్ రైఫిల్, ఒక .303 రైఫిల్, ఒక 12 బోర్ గన్, ఒక బీజీఎల్ లాంచర్, ఒక సింగిల్ షాట్ 315 బోర్ రైఫిల్, ఒక ఏకే47 ఉన్నాయి. అనేక మ్యాగజీన్‌లు, లైవ్ రౌండ్లు, గ్రనేడ్‌లు, బీజీఎల్ సెల్‌లు, మావోయిస్టు సాహిత్యం, నిత్యావసర వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నారు.

సంపుటి: 01 | సంచిక: 128 | హైదరాబాద్ | సోమవారం 28-07-2025 | పేజీలు: 04 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## బీఆర్ఎస్ విలీనంపై మరిన్ని సంచలనాలు..

# పిక్చర్ అభీ బాకీహై అంటున్న సీఎం రమేష్

**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**
బీజేపీలో బీఆర్ఎస్ ని విలీనం చేసేందుకు తనతో రాయబారం నడిపే ప్రయత్నం చేశారంటూ కేటీఆర్ గురించి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఎపిసోడ్ ఇక్కడితో అయిపోలేదని, మరికొన్ని సంచలనాలు మిగిలే ఉన్నాయని చెప్పారాయన. సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు బయటపెడతానన్నారు. నెక్స్ట్ ఎపిసోడ్స్ మిగిలే ఉన్నాయని హింట్ ఇచ్చారు సీఎం రమేష్.

**బతిమిలాడారు..**
"మేం ఇబ్బందుల్లో ఉన్నాం, మా నాన్న ఆరోగ్యం బాలేదు, మధనపడిపోతున్నారు, నువ్వు సాయం చెయ్యి, లిక్కర్ స్కామ్ లో కవితకు బెయిల్ వచ్చేలా చూడు. అవసరమైతే బీజేపీలో బీఆర్ఎస్ ని విలీనం చేస్తాం, లేదా తెలంగాణలో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుంది." కేటీఆర్ తనతో మాట్లాడిన మాటలు ఇవేనంటూ కుండబద్దలు కొట్టారు సీఎం రమేష్. లిక్కర్ స్కామ్ లో కవిత జైలులో ఉన్న సమయంలో ఆయన బీజేపీతో మంతనాలు జరిపేందుకు ప్రయత్నించారని, అందులో భాగంగానే తనను కలిశారని చెప్పారు. అయితే బీజేపీ అధిష్టానం ఆ ప్రతిపాదనను తిరస్కరించిందని తెలంగాణలో సొంతంగా ఎదుగుతామని చెప్పిందని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ మునిగిపోయే నావ అని, ప్రజలు బీఆర్ఎస్ నేతల నిజస్వరూపం తెలుసుకుని వారిని ఓడించారని, ఇకపై కూడా ప్రజలు ఆ పార్టీని నమ్మరనేది

మిగతా 2వ పేజీలో..





## బీసీలకు న్యాయం చేయగల పార్టీ ఒక్క బీఆర్ఎస్ మాత్రమే

- బీసీలకు నిజాయితీగా న్యాయం చేసేది బీఆర్ఎస్ మాత్రమే
- కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌పై కాంగ్రెస్ గుండాయిజం ఆరోపణలు
- రైతుబంధు, గృహలక్ష్మి లబ్ధిదారుల సమస్యలపై కేటీఆర్ విరుచుకుపాటు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

2




# ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

- సుంకేశుల, జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 1,02,580 క్యూసెక్కుల వరద నీరు
- ప్రస్తుతం శ్రీశైలం ఔట్ ఫ్లో 1,13,115 క్యూసెక్కులు
- నీటిని దిగువకు విడుదల

2



# తెలంగాణ బీజేపీ చీఫ్ పై మంత్రి పొన్నం ఫైర్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపాటు
- "ఎరువుల సరఫరా కేంద్రం ఆధీనంలోనే ఉంది" – మంత్రి వ్యాఖ్యలు
- రైతుల సమస్యలపై రాజకీయాలు చేయొద్దు.. బీజేపీకి హితవు
- కేంద్రంపై ఒత్తిడి తేవాలని కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు పిలుపు

2



## రాజీనామాపై మరోసారి స్పందించిన రాజాసింగ్

- ఇటీవలే బీజేపీకి గుడ్ బై చెప్పిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- తన రాజీనామా వెనుక ఎలాంటి కుట్రలేదని వెల్లడి
- అన్నీ ఆలోచించే రాజీనామా చేశానని స్పష్టీకరణ

2



## నాలుగో టెస్టు డ్రా



2

- ముగిసిన ఓల్డ్ ట్రాఫర్డ్ టెస్టు
- రెండో ఇన్నింగ్స్ లో 4 వికెట్లకు 425 పరుగులు చేసిన టీమిండియా
- గిల్ 103 పరుగులు, కేఎల్ రాహుల్ 90 పరుగులతో కీలక ఇన్నింగ్స్ లు





## బీఆర్ఎస్ విలీనంపై మరిన్ని సంచలనాలు.. పిక్చర్ అభీ బాకీహై అంటున్న సీఎం రమేష్

**మొదటిపేజీ తరువాయి**

బీజేపీ అధిష్టానం అభిప్రాయం అని చెప్పారు సీఎం రమేష్.

**దమ్ముంటే కాదని చెప్పు...**

కవిత జైలులో ఉన్నప్పుడు ఢిల్లీ వచ్చిన కేటీఆర్ తనని కలిశారో లేదో ఆయనే చెప్పాలని సవాల్ విసిరారు సీఎం రమేష్. కావాలంటే తాను సీసీ కెమెరాల వీడియోలన్నీ బయట పెడతానన్నారు. తనను కలవలేదని, తనతో బీఆర్ఎస్ విలీనం గురించి మాట్లాడలేదని కేటీఆర్ చెప్పగలడా అని అడిగారు. ఈ విషయంపై ఎక్కడ చర్చించడానికైనా తాను సిద్ధమేనన్నారు సీఎం రమేష్.

మీకో న్యాయం.. ఇతరులకో న్యాయమా?

మీరైతే ఢిల్లీలో లిక్కర్ వ్యాపారాలు చేసుకోవచ్చా, ఇతరులెవరూ తెలంగాణలో కాంట్రాక్ట్ లు చేయకూడదా అని సూటిగా ప్రశ్నించారు సీఎం రమేష్. 9 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కాంట్రాక్ట్ లన్నీ ఏ ప్రాంతం వారికి ఇచ్చిందో అందరికీ తెలుసన్నారు. అమెరికాలో బీఆర్ఎస్ సభలు పెట్టుకోవచ్చు కానీ, హైదరాబాద్ లో చంద్రబాబు అరెస్ట్ కి వ్యతిరేకంగా నిరసనలు తెలపకూడదా అని ప్రశ్నించారు. కేవలం జగన్ మెప్పు కోసమే అప్పుడు కేటీఆర్ నిరసనలకు వ్యతిరేకంగా మాట్లాడారని గుర్తు చేశారు. కమ్మ సామాజికవర్గం, రెడ్డి సామాజిక వర్గం నేతలపై కూడా కేటీఆర్ నీఛంగా మాట్లాడేవారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఆ రెండు సామాజిక వర్గాల నేతలు తమని మోసం చేశారని, తమకు జగన్ ఒక్కడే చాలని కేటీఆర్ చెప్పినట్టు గుర్తు చేశారు సీఎం రమేష్.

మొత్తమ్మీద సీఎం రమేష్ వ్యాఖ్యలు బీఆర్ఎస్ కి తీవ్రంగా నష్టం చేకూర్చాయని చెప్పాలి. బీఆర్ఎస్ ని బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనలను గతంలో కవిత కూడా తన లేఖ ద్వారా ధృవీకరించారు. తాజాగా సీఎం రమేష్ వ్యాఖ్యలతో ఆ ప్రతిపాదనలు నిజమేనని తేలిపోయాయి. మరి ముందు ముందు ఆయన బయటపెట్టే విషయాలు ఇంకెంత సంచలనంగా ఉంటాయో చూడాలి.



## రాజీనామాపై మరోసారి స్పందించిన రాజాసింగ్

- **ఇటీవలే బీజేపీకి గుడ్ బై చెప్పిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**
- **తన రాజీనామా వెనుక ఎలాంటి కుట్రలేదని వెల్లడి**
- **అన్నీ ఆలోచించే రాజీనామా చేశానని స్పష్టీకరణ**

**హైదరాబాద్ (సిద్దిపేట పవర్):**

హైదరాబాదులోని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇటీవలే బీజేపీకి రాజీనామా చేయడం తెలిసిందే. బీజేపీ హైకమాండ్ చెబితే, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని వెల్లడించారు. తాజాగా ఆయన తన రాజీనామాపై మరోసారి స్పందించారు.

తన రాజీనామా వెనుక ఎలాంటి కుట్ర లేదని స్పష్టం చేశారు. ఎవరి వల్ల పార్టీకి డ్యామేజి జరిగిందో, ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానానికి చెప్పడానికి ప్రయత్నించానని వెల్లడించారు. లక్షల మంది కార్యకర్తలు బీజేపీ కోసం తమ జీవితాలను త్యాగం చేశారని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఒక యోధుడు కావాలి అని అన్నారు.

కేంద్రమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా తనకు ఫోన్ చేయలేదని, ఆయన ఫోన్ చేసేంతటి పెద్ద వ్యక్తిని కానని రాజాసింగ్ అన్నారు. తాను మళ్లీ బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నానని, అందుకే కార్యకర్తల బృందాన్ని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పంపానని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని రాజాసింగ్ స్పష్టం చేశారు. తాను అన్ని విధాలుగా ఆలోచించిన తర్వాతే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

## నాలుగో టెస్టు డ్రా

- **ముగిసిన ఓల్ట్ ట్రాఫర్డ్ టెస్టు**
- **రెండో ఇన్నింగ్స్ లో 4 వికెట్లకు 425 పరుగులు చేసిన టీమిండియా**

టీమిండియా, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన నాలుగో టెస్టు మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఒకానొక దశలో ఓటమి తప్పదనుకున్న టీమిండియా... కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఆల్ రౌండర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ సాధించిన అద్భుత శతకాలు, కేఎల్ రాహుల్ కీలక ఇన్నింగ్స్ సాయంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించగలిగింది. తద్వారా సిరీస్ సమం చేసేందుకు ఆశలు సజీవంగా నిలుపుకుంది.

భారత్ రెండో ఇన్నింగ్స్... పోరాడిన బ్యాటర్లు

నిన్న నాలుగో రోజు ఆటలో 311 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (0), సాయి సుదర్శన్ (0) పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరారు. దీంతో భారత్ 0 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ దశలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103) కేఎల్ రాహుల్ (90) తో కలిసి మూడో వికెట్‌కు 188 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. గిల్ అద్భుత సెంచరీ సాధించగా, రాహుల్ కూడా చక్కటి బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. రాహుల్ 90 పరుగుల వద్ద ఔటైన తర్వాత, గిల్ కూడా 103 పరుగుల వద్ద జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు.

అయితే, అనంతరం క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ (101 నాటౌట్), రవీంద్ర జడేజా (107 నాటౌట్) వీరోచిత పోరాటం చేశారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 203 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లారు. సుందర్, జడేజా ఇద్దరూ అద్భుత సెంచరీలు సాధించి భారత జట్టును సురక్షితమైన స్థితికి చేర్చారు. ఐదో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 4 వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసింది. ఇంగ్లండ్‌కు మరో 6 వికెట్లు అవసరం కాగా, భారత్ భారీ ఆధిక్యాన్ని సాధించడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఈ మ్యాచ్ డ్రా కావడంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ 21 ఆధిక్యంలో కొనసాగుతుంది. చివరిదైన ఐదో టెస్టు జూలై 31 నుంచి లండన్‌లోని కెన్నింగ్‌టన్ ఓవల్‌లో ప్రారంభమవుతుంది.

### బీసీలకు న్యాయం చేయగల పార్టీ

# ఒక్క బీఆర్ఎస్ మాత్రమే

- **బీసీలకు నిజాయితీగా న్యాయం చేసేది బీఆర్ఎస్ మాత్రమే**
- **కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌పై కాంగ్రెస్ గుండాయిజం ఆరోపణలు**
- **రైతుబంధు, గృహలక్ష్మి లబ్దిదారుల సమస్యలపై కేటీఆర్ విరుచుకుపాటు**
- **స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు**

**హైదరాబాద్ (సిద్దిపేట పవర్):**




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీసీల హక్కుల విషయంలో కేసీఆర్ తప్ప మరెవ్వరూ నిజాయితీగా న్యాయం చేయలేరని స్పష్టం చేశారు. పరకాలలోని లలితా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు కుట్టుమిషన్లు, కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజాసేవే రాజకీయ జీవితానికి ప్రాణమని కేటీఆర్ పేర్కొన్నారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమాన్ని నిర్వహించిన పోచంపల్లి శ్రీనివాసరెడ్డిని అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేకపోతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, "ఎక్కడ తులం బంగారం, ఎక్కడ రైతుబంధు రూ. 15 వేల రూపాయలు?" అని ప్రశ్నించారు. ప్రజలతో మోసపూరిత రాజకీయాలు చేస్తోందని రేవంత్ ప్రభుత్వంపై ఆరోపించారు.

వరంగల్ పద్మశాలీల సమస్యలను ప్రస్తావిస్తూ, "ఆజంజాహీ మిల్లు మూతపడిన తర్వాత వలసపోయిన కార్మికులను కేసీఆర్ స్వరాష్ట్రానికి తిరిగి తెప్పించేందుకు కృషి చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక 1,500 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశారు," అని కేటీఆర్ తెలిపారు. కేరళకు చెందిన కీటెక్స్ సంస్థ రూ. 2,400 కోట్ల పెట్టుబడి పెట్టిందని, దక్షిణ కొరియాకు చెందిన యంగ్ వన్, గణేష్ ఎకోటెక్స్ సంస్థలు కూడా యూనిట్లు ప్రారంభించాయని గుర్తుచేశారు.

అయితే, ఈ టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పడిన అవకాశాలను కాంగ్రెస్ నేతలు దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. "కీటెక్స్ సంస్థ 25 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని ప్రకటించగా, కాంగ్రెస్ నేతలు బెదిరింపులు చేస్తున్నారు. పరిశ్రమలకు అడ్డంకులు పెడుతూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారు," అని మండిపడ్డారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే పరిశ్రమలు నిలకడగా ఉంటాయని కేటీఆర్ పిలుపునిచ్చారు. "కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌లో కాలువ నిర్మాణానికి 137 కోట్ల రూపాయల అంచనాలను కాంగ్రెస్ నేతలు 297 కోట్లకు పెంచారు. ఒక్క కాలువ నిర్మాణంలోనే వరంగల్ కాంగ్రెస్ నేతలు రూ. 167 కోట్లు దోచుకోవాలని చూశారు," అని ఆరోపించారు.

కేటీఆర్ మాట్లాడుతూ, "తెలంగాణలోని ప్రతి ఆడబిడ్డకు ప్రభుత్వం 50 వేల రూపాయలు ఇవ్వాల్సి ఉంది. స్వయం సహాయక బృందాలకు 3,000 కోట్ల రూపాయలు ఇవ్వాల్సింది కానీ రేవంత్ ప్రభుత్వం కేవలం రూ. 300 కోట్లు ఇచ్చింది," అని విమర్శించారు. గృహలక్ష్మి పథకం కింద పరకాల నియోజకవర్గంలోని 3 వేల మంది లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వడం లేదని, దీనిపై కోర్టు కూడా స్పందించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.

ఎరువుల సమస్యను ప్రస్తావిస్తూ, "కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎరువులు ముందుగానే కొనుగోలు చేసి బఫర్ స్టాక్ ఉంచేవారు. ఆయన పాలనలో ఎప్పుడూ రైతులు ఎరువుల కోసం క్యూల్లో నిలబడలేదు. కానీ రేవంత్ ప్రభుత్వం రైతులకు అవస్థలు కలిగిస్తోంది," అని కేటీఆర్ విమర్శించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "గులాబీ కండువా కప్పుకుని వచ్చే ప్రతి కార్యకర్తను కేసీఆర్ ప్రతినిధిగా భావించి ఆశీర్వదించండి," అని ఆయన అన్నారు.



## తెలంగాణ బీజేపీ చీఫ్ పై మంత్రి పొన్నం ఫైర్

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపాటు**
- **"ఎరువుల సరఫరా కేంద్రం ఆధీనంలోనే ఉంది" – మంత్రి వ్యాఖ్యలు**
- **రైతుల సమస్యలపై రాజకీయాలు చేయొద్దు.. బీజేపీకి హితవు**
- **కేంద్రంపై ఒత్తిడి తేవాలని కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు పిలుపు**

**హైదరాబాద్ (సిద్దిపేట పవర్):**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన ఒక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎరువుల కొరతపై బీజేపీ చేస్తున్న విమర్శలు నిరాధారమని, "ఎరువులు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయనే విషయం కూడా రామచంద్రరావుకి తెలియదా?" అంటూ మండిపడ్డారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, "వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాలు, ఎరువులు ఎక్కడి నుండి వస్తాయో కూడా రామచంద్రరావుకి అర్థం కావడం లేదు. మిగతా విత్తనాలు, నీళ్లు, విద్యుత్ వంటి సదుపాయాలను రాష్ట్రాలు అందిస్తున్నాయి కానీ ఎరువుల తయారీ, సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది" అని స్పష్టం చేశారు.

"కేంద్రం సరైన విధంగా ఎరువులు సరఫరా చేయడంలో విఫలమవుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనం చేయడం ఎందుకు?" అని ప్రశ్నించారు. అంతేకాకుండా.. "బీజేపీ అధ్యక్షుడు తెలంగాణ రైతుల సమస్యలను అర్థం చేసుకోవడం లేదు. ఢిల్లీకి వెళ్లి మీ ప్రధానమంత్రిని కలిసి తెలంగాణకు అవసరమైన ఎరువులు సరఫరా చేయించండి. రైతుల సమస్యలపై రాజకీయాలు చేయడం మానేయాలి" అని హెచ్చరించారు.

రైతుల అవసరాల కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని గుర్తు చేస్తూ, "ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత మంత్రులను కలిసి ఎరువుల సరఫరా కోసం విజ్ఞప్తి చేశారు. కానీ బీజేపీ నాయకులు ఈ విషయం మీద మౌనం వహిస్తున్నారు" అని ఆరోపించారు.

"దేశంలో 29 రాష్ట్రాల మధ్య తెలంగాణ పట్ల కేంద్రం ఎంత వివక్షత చూపుతోందో ప్రజలు గుర్తించాలి. బీజేపీ నాయకులు కేంద్రాన్ని ఒత్తిడి చేసి తెలంగాణ రైతులకు కావాల్సిన ఎరువులు తీసుకురావాలి" అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువులను దాచిపెడుతోందని చెప్పడం పూర్తిగా అబద్ధమని ఆయన ఖండించారు. "ఎరువులు ఎంత స్టాక్‌లో ఉన్నాయి, ఎంత సరఫరా కావాల్సి ఉంది అనే వివరాలు సేకరించి, ఢిల్లీకి వెళ్లి రామచంద్రరావు మాట్లాడాలి" అని సవాలు చేశారు.

మంత్రి మాట్లాడుతూ, "రైతులు, పల్లెలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీల సమస్యలను అర్థం చేసుకోవడంలో బీజేపీ పూర్తిగా విఫలమైంది. కేంద్రం సరైన విధంగా ఎరువులు పంపకపోవడం వల్లే ఈ ఇబ్బందులు వస్తున్నాయి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి బీజేపీ నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అని అన్నారు.

## సూర్యాపేటలో బంగారం చోరీ ఘటన.. మహిళ అరెస్ట్

**సూ ర్యాపేట(సిద్దిపేట పవర్):**

ఈనెల 21న సూర్యాపేటలో జరిగిన బంగారం చోరీ ఘటనలో ఒకరిని అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. సూర్యాపేటలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు.

''జ్యువెలరీ షాపులో ఐదుగురు నిందితులు 2.05కిలోల బంగారం చోరీ చేసినట్లు గుర్తించాం. వీరిలో ముగ్గురు నేపాల్ దేశస్థులు. ఇద్దరు ఝార్ఖండ్‌కు చెందిన వారు. నిందితులు షాపునకు సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని రెక్కీ నిర్వహించారు. ఈ కేసులో ఓ మహిళను అరెస్ట్ చేశాం. ఆమె నుంచి 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నాం. నిందితుల చోరీకి ఆ మహిళ సహకరించింది. చోరీ చేసిన బంగారం హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తూ సూర్యాపేట బస్టాండ్‌లో ఆమె పట్టుబడింది. నిందితులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం'' అని ఎస్పీ తెలిపారు.

### ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు

## భారీగా వరద నీరు

- **సుంకేశుల, జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 1,02,580 క్యూసెక్కుల వరద నీరు**
- **ప్రస్తుతం శ్రీశైలం ఔట్ ఫ్లో 1,13,115 క్యూసెక్కులు**
- **నీటిని దిగువకు విడుదల**

**హైదరాబాద్ (సిద్దిపేట పవర్):**

కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా కృష్ణా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. తద్వారా సుంకేశుల, జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి శ్రీశైలంకు 1,02,580 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం ఔట్ ఫ్లో 1,13,115 క్యూసెక్కులుగా నమోదైంది.

ఒక గేటు ద్వారా 26,698 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ కు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడి గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 31,102 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా... ప్రస్తుతం 882 అడుగుల నీటి మట్టం ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 198.81 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.



## మరో ఇద్దరితో ఐశ్వర్య ఎఫైర్.. తేజేశ్వర్ కేసులో తెరపైకి సంచలన విషయాలు

- **తేజేశ్వర్ హత్య కేసులో పోలీసులు వేగవంతమైన దర్యాప్తు**
- **ఐశ్వర్య స్కూటీకి జీపీఎస్ అమర్చిన తిరుమల రావు**
- **సుపారీ గ్యాంగ్ ఒప్పందం వెనుక ఐశ్వర్య ఒత్తిడి**

**హైదరాబాద్ (సిద్దిపేట పవర్):**

గద్వాల నవ వరుడు తేజేశ్వర్ హత్య కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో కీలక నిందితులైన A1 తిరుమల రావు, A2 ఐశ్వర్యలను పోలీసులు కస్టడీలోకి తీసుకుని వేర్వేరుగా విచారిస్తున్నారు. ఈ విచారణలో అనేక సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయని పోలీసులు తెలిపారు.

విచారణలో తిరుమల రావు ఐశ్వర్యపై అనుమానంతో ఆమె స్కూటీకి జీపీఆర్ఎస్ (GPS) అమర్చినట్లు తేలింది. ఐశ్వర్య కదలికలను నిరంతరం ట్రాక్ చేయడానికి తిరుమల రావు ఈ పని చేసినట్లు పోలీసులు గుర్తించారు.తేజేశ్వర్ హత్య వెనుక ఐశ్వర్య ఒత్తిడి ఉందని విచారణలో వెల్లడైంది. ఐశ్వర్య బలవంతం చేయడంతోనే తిరుమల రావు సుపారీ గ్యాంగ్‌తో తేజేశ్వర్‌ను హత్య చేయడానికి ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా, ఐశ్వర్యకు తిరుమల రావుతో పాటు మరో ఇద్దరితోనూ అక్రమ సంబంధాలు ఉన్నాయని విచారణలో వెల్లడైంది. ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తేజేశ్వర్ హత్య కేసులో ఈ కొత్త విషయాలు కేసును మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. పోలీసులు నిందితులను మరింత లోతుగా విచారించి, ఈ హత్యకు గల పూర్తి కారణాలను, ఇందులో ఉన్న ఇతర వ్యక్తులను వెలికి తీయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరు ఉన్నారనేది తెలియాల్సి ఉంది.






# గజ్వేల్ పట్టణ సమస్యలు పరిష్కరించాలి

- ముంపు గ్రామాల గ్రామపంచాయతీ కార్మికుల బకాయి జీతాలు ఇవ్వాలి.

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

గజ్వేల్ పట్టణంలో పెండింగ్లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ ని పట్టణంలో నిర్మిస్తున్న బస్టాండ్ నిర్మాణం, ఔటర్ రింగ్ రోడ్ పూర్తిచేయాలని, పెండింగ్లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, కాలనీలలో సిసి రోడ్లు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముంపు గ్రామాల కార్మికులకు పెండింగ్లో ఉన్న ఆరు నెలల జీతాలు వేయాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగం బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వర్షాలతో కాలనీలలో, రోడ్లపై నీళ్లు నిలబడుతున్నాయని ముందస్తు చర్యలు తీసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్న కొత్త వారికి ఇవ్వడం లేదని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మరాఠి కృష్ణమూర్తి, మొగుల రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# మల్లన్న సాగర్ పనులను వేగవంతం చేయాలి..!

- మెగా కన్స్ట్రక్షన్ పనులను నిర్లక్ష్యం
- గ్రామాల అభివృద్ధి మన్ కీ బాత్ లక్ష్యం
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 27: ప్రతినిధి**

మల్లన్న సాగర్ పనులను వేగవంతం చేయాలని, మారుమూల గ్రామాల అభివృద్ధి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ లక్ష్యమని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... 50 టీఎంసీ సామర్థ్యం గల మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం మెగా కాంట్రాక్టు వారు పనులను పూర్తిగా నిర్లక్ష్యం ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులను వేగవంతం చేయాలని సూచించారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ శాఖ అధికారులు ఒక్కొక్కరు ఏసీబీ వలన చిక్కడం వల్ల కూడా పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ద్వారా ప్రవహించే నీటి విడుదల అలసత్వం అవుతుందని ఇటీవల భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి కూడా లేఖ పూర్వకంగా విన్నవించడం జరిగిందన్నారు. మల్లన్న సాగర్ నీరందక కొన్ని గ్రామాల రైతులు ఇంతవరకు వ్యవసాయ పనులను ప్రారంభించలేదని తెలిపారు. ఇప్పటికైనా మల్లన్న సాగర్ పనులను వేగవంతం చేయాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలంతా అసంఘటితంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని లక్ష్యంగా ప్రతి నెల చివరి ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఇట్టి కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు. 2047 వికక్షిత భారత్ లక్ష్యమే ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా ధర్మారం మాజీ సర్పంచ్

# రాజు జన్మదిన వేడుకలు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

జగదేవపూర్ గ్రామ అభివృద్ధి తో పాటు ప్రజా సంక్షేమంతో ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తున్న ధర్మారం గ్రామ ప్రజల ముద్దుబిడ్డ ధర్మారం గ్రామ మాజీ సర్పంచ్, కొరవి కృష్ణ స్వామి జిల్లా అధ్యక్షులు పిట్టల పిట్టల రాజు ముదిరాజ్ జన్మదినం సందర్భంగా ఆదివారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాగుల రాజు , మర్కుక్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మ్యాకల కనకయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని జీవితంలో ఇంకా ఉన్నంత పదవులు స్వీకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వారి వెంట లింగారెడ్డిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ ,మండల ముదిరాజ్ సంఘం ఉప ఉపాధ్యక్షులు బాలకిషన్, మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.







# ఆర్యవైశ్యులు అన్ని విధాలా ఎదగాలి

- రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్ .
- సిద్దిపేట ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట వివిఎస్ఎస్ బ్యాంకెట్ హాల్ నందు ఆదివారం మధ్యాహ్నం జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు అధ్యక్షతన కార్యవర్గ సమావేశము ఏర్పాటు చేసి ఉత్తీర్ణత (అధిక మార్కులు) పొందిన విద్యార్థిని విద్యార్థులకు, పలు దేవాదాయ ధర్మాదాయ శాఖలో చైర్మెన్లుగా, వైస్ చైర్మెన్లుగా డైరెక్టర్లుగా నియమించబడిన వారికి సహసపోతమైన కార్యక్రమాల్లో పాల్గొన్నవారికి 100 మందికి **ప్రశంసా పూర్వక సన్మానాలు నిర్వహించారు.**

ఈ సందర్భంగా కార్యక్రమా నికి అతిథిగా హాజరైనటువంటి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్ పలువురు సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులను అన్ని రంగాల్లో ముందుండాలని వ్యాపారంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆర్యవైశ్యులు ముందుంటారని మరి అదే సేవా భావంతో ఈరోజు సిద్దిపేట జిల్లాలోని ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులు వారి చదువుల్లో మంచి ఉత్తీర్ణత శాతాన్ని తీసుకొచ్చుకున్న వారికి పలు దేవాలయ కమిటీల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఆర్యవైశ్యులు బాధ్యతలు పొందినటువంటి వారికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ పక్షాన సన్మానించడం చాలా గొప్ప విషయమని, సన్మాన గ్రహీతలు ఈ యొక్క కార్యక్రమం ద్వారా వారిలో ఉనికిని పెంచుకొని ఇంకా ఉత్సాహంగా వారి వారి విధుల్లో ముందుకు సాగుతారని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినటువంటి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కమిటీ వారిని అభినందించారు సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలిజజేసినారు, అదే విధంగా పేద ఆర్యవైశ్యులకు ఎప్పుడు ఏ అవసరమున్న సహాయం చేయడానికి సంఘం సిద్ధంగా ఉంటుందని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పక్షాన ఈ సమావేశంలో తెలియజేస్తున్నానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్ గుప్తా కోశాధికారి డాక్టర్ మాంకాల నవీన్ కుమార్ తాజా మాజీ అధ్యక్షులు కాసం నవీన్ అదనపు ప్రధాన కార్యదర్శి గంప కృష్ణమూర్తి ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు యాసాల వెంకట లింగం రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శి హేమలత గజ్వేల్ పురపాలక సంఘం మాజీ చైర్మన్ ఎన్సి రాజమౌళి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి నాచారం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ పల్లెర్ల రవికుమార్ యువజన విభాగం అధ్యక్షులు మాంకాల నగేష్ మహిళా విభాగం అధ్యక్షురాలు పబ్బా మాధవి సేవాదళ్ విభాగం అధ్యక్షులు డాక్టర్ రావికంటి చంద్రశేఖర్ అదే విధంగా ఈ జిల్లా మహాసభలో పలు విభాగాల ద్వారా సేవలందిస్తున్నటువంటి ప్రధాన కార్యదర్శులు కోశాధికారులు వర్కింగ్ ప్రెసిడెంట్స్ pro లు పుల్లూరు శివకుమార్ పుల్లూరు శశాంక్ నీరుమల్ల రవీందర్ అరవపల్లి హరికిరణ్ లతా మరియాల వాణి ప్రణవి ప్రెస్ అకాడమీ మాజీ సభ్యులు కొమరవెల్లి అంజయ్య ఇతర కార్యవర్గ సభ్యులు మండల అధ్యక్షులు సన్మాన గ్రహీతల తల్లిదండ్రులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట మారథాన్ రన్నింగ్ లో పాల్గొన్న సిద్దిపేట పోలీస్ అధికారులు, సిబ్బంది

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట మారథాన్ 3 వ ఎడిషన్ రంగనాయక సాగర్ ప్రాజెక్టుపై సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ & పోలీస్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా నిర్వహించిన మారథాన్ రన్నింగ్ లో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఇన్స్పెక్టర్లు/సీఐలు & సిబ్బంది 5k, 10k ,21k రన్ పూర్తిచేసి యువతకు స్ఫూర్తిగా నిలిచినారు.









# దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వంలో యూరియా బస్తాలు తీసుకున్న మహిళా పై పోలీసులు నాన్ బెయిల్ బులు కేసు పెట్టడం సిగ్గు చేటు

- మండల బీ ఆర్ యస్ పార్టీ అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

మండల బీ ఆర్ యస్ పార్టీ అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వం లో భర్త, కొడుకు ఆధార్ పేరు మీద రెండు యూరియా బస్తాలు ఎక్కువ తీసుకుందని ఓ మహిళ మీద నాన్ బెయిలబుల్ కేసు పెట్టాడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. సంగెం మండలం నల్లబెల్లి ఊరిలో ఓ మహిళ తన ఆదార్ కార్డు, తన భర్త కొడుకుల ఆధార్ కార్డులు చూపించి 3 యూరియా బస్తాలు తీసుకున్నది.ఆ బస్తాలతో ఇంటికి వెళ్తుంటే పోలీసులు ఆపి, ఆ మహిళ మీద నాన్ బెయిలబుల్ కేసు పెట్టారు.ఈ దుర్మార్గపు ప్రభుత్వంలో యూరియా బస్తాలు తీసుకుంటే, ఏదో మర్డర్ చేసినట్టు మహిళా రైతులు అని కూడా చూడకుండా నాన్ బెయిలబుల్ కేసులు పెడుతున్నారని దుర్మార్గపు చర్య అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే ఇచ్చిన 420 హామీలు కూడా నెరవేర్చలేని అసమర్ధ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్షల మీద కేసులు పెట్టడం తప్ప మళ్ళీ ప్రతి పక్ష హోదా కూడా ఉన్నా మాట్లాడితే కేసులు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వనికే సిగ్గుచేటు అని హెచ్చరించారు.

# అందరికి కృషతో వైభవంగా పోచమ్మ ఆలయాన్ని నిర్మించుకుందాం..!





- అందరికి కృషతో వైభవంగా పోచమ్మ ఆలయాన్ని నిర్మించుకుందాం..!
- ఆలయ నిర్మాణం కు శంకుస్థాపన చేసిన దుబ్బాక ఎమ్మెల్యే, ఎంపీ
- దుబ్బాక రెవెన్యూ డివిజన్ కోసం, మల్లన్న సాగర్ ఉప కాలువల కోసం మరో ఉద్యమం నిర్మిద్దాం..

**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 27: ప్రతినిధి**

దుబ్బాక ప్రజలు గర్వపడేలా, ఆలయ వైభవం ఉట్టిపడేలా పోచమ్మ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించుకుందామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. దుబ్బాక పట్టణంలో పోచమ్మ తల్లి దేవాలయానికి ఎంపీ రఘునందన్ రావు, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య లతో కలిసి దేవాలయ పునర్నిర్మానం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోచమ్మ తల్లి అంటే అన్ని కులాల వారికి ఆరాధ్య దైవమని, అందరం పోచమ్మ తల్లి ఆశీస్సులు తీసుకుంటామన్నారు. రాజకీయాల్లోకి రాకముందే దుబ్బాకలోని వెంకటేశ్వర దేవాలయ నిర్మాణం కు పది లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందని తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ మూడు కోట్లకు పైగా ఇవ్వడం జరిగిందని అందరి సహకారంతో బ్రహ్మాండంగా నిర్మించుకోవడం జరిగిందన్నారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం తరహాలోనే పోచమ్మ తల్లి దేవాలయం కూడా అంగరంగ వైభవంగా నిర్మించుకుందామని ఆయన తెలిపారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు పోచమ్మ తల్లి దేవాలయం షెడ్డు కోసం ఐదు లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎంపీ గా ఉన్న సమయంలో అధిక నిధులు దుబ్బాక నియోజకవర్గంకు కేటాయించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో ఎమ్మెల్యేలకు పైసా నిధులు ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. నాడు ఎమ్మెల్యేగా ఉన్న రఘునందన్ రావు నేడు ఎంపీగా... నేను ఎంపీ నుండి ఎమ్మెల్యేగా రావడం జరిగిందని దేవాలయ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఆలయ నిర్మాణం కోసం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు దుబ్బాక రెవెన్యూ డివిజన్ కోసం ఒక జేఏసీ ఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా పోరాటం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు అలాగే మల్లన్న సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఉప కాలువల నిర్మాణం కోసం పోరాటం చేద్దామని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు రొట్టె రాజమౌళి, అధ్యక్షులు వడ్లకొండ శ్రీధర్, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, గన్నే భూమిరెడ్డి, పల్లె రామస్వామి, కృష్ణ , బండల రాజు, బిజెపి నాయకులు సుభాష్ రెడ్డి, చింత సంతోష్, శ్రీకాంత్ యాదవ్, విభీషణ్ రెడ్డి, పుల్లూరు రాజు తో పాటు, ఆలయ కమిటీ నాయకులు, పట్టణ కుల సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

**నంగునూరు జూలై 27(సిద్దిపేట పవర్)**

నంగునూర్:నంగునూర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది.198485 సంవత్సరంలో సిద్ధిపేట జిల్లా నంగునూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. నాలుగు దశాబ్దాల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ బాల్య జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశానికి విచ్చేసిన తమ గురువులకు పూలు చల్లుతూ వేదిక వద్దకు తీసుకెళ్లారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులకు ఈ సందర్భంగా పాదపూజ నిర్వహించారు. తమకు చదువు చెప్పి మృతి చెందిన గురువుల చిత్ర పటాలకు నివాళులు అర్పించారు. తమతో పాటు చదువుకుని చనిపోయిన మిత్రులను గుర్తు చేసుకుని వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం గురువులు రొడ్డ రామచంద్రారెడ్డి, గౌరీభట్ల నరసింహస్వామి, ఎల్లంకి రామచంద్రారెడ్డి, ఏర్వ రంగారెడ్డి లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాతూరి శ్రీనివాసరెడ్డి, కత్తుల లక్ష్మారెడ్డి,బూసిరెడ్డి నరోత్తం రెడ్డి,యాంసాని వెంకట సురేశ్ కుమార్, బొజ్జ సత్య నారాయణ, గాడిపల్లి రవీందర్ రెడ్డి, దేవులపల్లి పరశు రాములు, వల్లపూరెడ్డి మల్లారెడ్డి, వెంకయ్యగారి ధర్మారెడ్డి, వీర గురువు, వల్లుపురెడ్డి శ్రీలత, సి.రాధ, బెజగామ సత్య లక్ష్మీ, అరగొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి ..!

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**సిద్దిపేటపవర్, న్యూస్ జూలై 27: ప్రతినిధి**

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని బాధితులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్వచ్ఛ భారత్ టైటిల్ తో సిద్ధిపేట లో షార్టఫిల్మ్"

- దర్శకుడు బాబు మహారాజ్.

**సిద్దిపేట పవర్:**

స్వచ్ఛ భారత్ టైటిల్ తో సిద్ధిపేట పరిసర ప్రాంతాల్లో షార్టఫిల్మ్ షూటింగ్ నిర్వహించడం జరిగింది. దీనికి సంబంధించిన ప్రీ & పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నీ పూర్తి స్థాయిలో పూర్తయ్యాయని దర్శకుడు బాబు మహారాజ్ తెలియజేశారు. టెక్నికల్ వర్క్ లో భాగంగా ఫోటోగ్రఫీ:నాని & భరత్,కాస్టింగ్ మెయిన్ లీడ్ గా సహస్ర, మదర్ఇంలా రోల్ లో సుగుణ గారు, మున్సిపల్ కార్మికుడిగా గణేష్, స్కూల్ టీచర్ గా రమ, సుప్రియ గార్లు ఎడిటర్ గా చిరంజీవిగారు తదితరులు నటించారు. దీనికి సిద్ధిపేట ఆర్ట్స్ & టెక్నీషియన్ అసోసియేషన్ సహకారం అందించడం పూర్తి అభినందనీయం. కథ ముఖ్య ఉద్దేశ్యం దేశం నుండి గ్రామ స్థాయి వరకు పారిశుధ్య కార్మికుల సేవలు అనిర్వచనీయం, కరోనా సమయంలో డాక్టర్స్ కి సమాఖలీకులుగా పనిచేసారు. వీరందరు అణగారిన వర్గాలకు సంబంధించిన సామాజిక వర్గం వారు కాబట్టి వీరికి సరైన గుర్తింపు స్వాతంత్రం వచ్చిన ఇన్ని ఏండ్లకు అయినా తగిన గౌరవం, గుర్తింపు లభించలేకపోవడం శోచనీయం. భారత దేశపు సరిహద్దుల్లో దేశం కోసం మరణిస్తున్న సైనికుల సంఖ్య కన్నా పారిశుధ్య సైనికులుగా మరణిస్తున్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉందని గుర్తించవలసిన అవసరం ఏంతో ఉందని తెలియజేస్తు ఇప్పటినుండి ప్రభుత్వాలు పారిశుధ్య కార్మికులకు మౌలిక సదుపాయలు , ఆరోగ్య భద్రత, జీతాల పెంపు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకునేలా సూచించే చిత్రమని కథ ఉద్దేశ్యం.తెలంగాణలో అన్ని జిల్లాల్లో కెల్లా స్వచ్ఛతలో సిద్ధిపేట జిల్లా ముందుండటం మాకు చాలా ఆనందనీయం దీనికి కృషి చేస్తున్న వారి జీవితాలని కూడా సమాజం ముందు వరుసలో ఉంచేలా నాయకులు కూడా కృషి చేయవలసిన అవసరత ఉందని తెలుపుతున్నాం. కొద్ది రోజుల్లోనే యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజల్లో కి తీసుకెళ్తామని దర్శకుడు తెలియజేశాడు.





## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2001-03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు.**

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట పట్టణం లోని శ్రీ విజ్ఞాన భారతి కళాశాల (ఎస్ వి బి ) ఇంటర్మీడియట్ 2001 03 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 22 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకచోట కలిసి పాత మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. ఆత్మీయంగా పలకరించుకుని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చాలా రోజుల తర్వాత స్నేహితులందరం ఒకచోట కలిసి కళాశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్, శేఖర్, సంతోష్, ఇబ్రహీం, లక్ష్మణ్, ప్రభాకర్, లక్ష్మణ్, స్వప్న, కవిత, రజిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



## "పరుగెత్తుతూ.. ఆరోగ్యంగా జీవిద్దాం"

- రంగనాయక సాగర్‌పై హాఫ్ మారథాన్.. భారీగా పాల్గొన్న అథ్లెట్లు !!

**సిద్దిపేట పవర్ ప్రతినిధి:**

సిద్దిపేటలో ఏటా నిర్వహించే హాఫ్ మారథాన్ ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం ఉదయం సిద్దిపేట శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ కట్టపై హాఫ్ మారథాన్‌ను నిర్వహించారు. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు శాఖ సహకారంతో హాఫ్ మారథాన్3కి సిద్దిపేటతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అథ్లెట్లు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ఎంపీ రఘునందన్‌రావు, సిద్దిపేట జిల్లాస్థాయి అధికారులు, పలువురు సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు పాల్గొన్నారు. 5K, 10K, 21K రన్‌లో మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

2023 మార్చి 8న సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. ప్రస్తుతం 200 మందికి పైగా సభ్యులు ఉన్నారు. పరుగెత్తుతూ.. ఆరోగ్యంగా జీవిద్దాం అనే లక్ష్యంతో ఆవిర్భవించిన ఈ సంఘంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వివిధ వృత్తులు, వయసుల వారున్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో అసోసియేషన్ సభ్యులు పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. 100 మంది మారథాన్ స్థాయికి ఎదిగారు.

సిద్దిపేట వేదికగా హాఫ్ మారథాన్ నిర్వహణకు రెండు నెలలుగా కసరత్తు చేశారు. 40 మందితో కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటైంది. సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేశారు. రెండు నెలల కిందట ఆన్‌లైన్‌లో నమోదు ప్రారంభించారు.



## భారీవర్షా ల మధ్య సిద్దిపేట నుండి కర్నాటకకు 42 రైలు బోగీల కక్కుళ్లు పంపిణీ

**సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 26: ప్రతినిధి**

గత నాలుగు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నప్పటికీ, ఆహార సంస్థ (ఎఫ్ సి ఐ,ఎస్ ) యొక్క నిబద్ధత మరియు సమన్వయం ఫలితంగా, సిద్దిపేట రైల్వే గూడ్స్ షెడ్ నుండి కర్నాటకలోని కోప్పల్ ఎఫ్‌సిఐ ఫుడ్ స్టోరేజ్ డిపోకు 42 బోగీల రా ఫోర్టిఫైడ్ రైస్ కర్నల్స్ (FRK) తో కూడిన రైలు విజయవంతంగా పంపిణీ చేయబడింది.ఈ రైస్ స్టాక్ ఎస్ డబుల్యూ సి హబ్సిపూర్ గోదాంనుండి ట్రక్కుల ద్వారా రైల్వే లోడింగ్ పాయింట్‌కు తరలించబడింది. భారీ వర్షాల మధ్య లోడ్ చేయబడిన 90కు పైగా ట్రక్కులు, మట్టిబారిన మార్గాల ద్వారా ప్రయాణించాయి. 200 మందికి పైగా కూలీలు చిత్తశుద్ధితో పనిచేసి రైలు బోగీల లోడింగ్ విజయవంతంగా పూర్తి చేశారు.వర్షపు నీటితో బస్తాలు తడిచిపోకుండా ఉండేందుకు ఎఫ్ సి ఐ,ఎస్,ఎస్ డబ్ల్యు సి మరియు హ్యాండ్లింగ్ & ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ ఉన్నత శ్రద్ధ వహించారు. ట్రక్కులు మరియు బస్తాలపై పాలిథీన్ షీట్లు వేసి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీని ద్వారా ధాన్య నాణ్యత పూర్తిగా కాపాడబడింది.

గత రెండు మూడు సీజన్లలో ఖరీఫ్ మరియు రబీ పంటల కాలాల్లో సిద్దిపేట జిల్లాలో బంపర్ వరి దిగుబడి నమోదైంది. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా రైస్ మిల్లర్ల నుండి వరి కొనుగోలు చేసి,.ఎఫ్ సి ఐ,ఎస్,హైరెడ్ గోదాంలలో (హబ్సిపూర్, చెర్ల అంకిరెడ్డిపల్లి, గుర్రలగొండీ, గజ్వేల్, చెబర్తి) భద్రంగా నిల్వ చేసింది.ఈ బియ్యం ఉత్పత్తి ఎక్కువగా ఉన్న తెలంగాణ నుండి అపరిపూర్ణ ధాన్య ఉత్పత్తి కలిగిన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఝార్ఖండ్, బీహార్ వంటి రాష్ట్రాలకు తరలించబడుతోంది. ఈ విధంగా తెలంగాణ దేశానికి నాణ్యమైన బియ్యం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రైలు లోడింగ్ విజయవంతంగా నిర్వహించిన ఎఫ్ సి ఐ,ఎస్ దేశ భద్రత కోసం తన నిబద్ధతను మరోసారి రుజువు చేసింది.ఎఫ్ సి ఐ,ఎస్ డబ్ల్యూసి మరియు హెచ్ అండ్ టి కాంట్రాక్టర్ సిబ్బంది చూపిన కష్టపడి పనిచేసే తత్వం అభినందనీయమైనది.




## శ్రీ రేణుకా మాత అమ్మవారిని దర్శించుకున్న సీనియర్ సిద్దిపేట ఏబీఎన్ ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ సుభాష్

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ 26 ప్రతినిధి**

ఆలయ కమిటీ చైర్మన్ ఎల్పుల మహేష్ సన్మానించారు దంపతులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేసి ఫోటోతో పాటు ప్రసాదమును అందజేసిన ఆలయం కమిటీ సభ్యులు.మా గ్రామంలో అమ్మవారిని దర్శించుకునే మీడియా మిత్రులు సమాచారం ఇచ్చి అమ్మవారిని దర్శించుకోగలరు.. ఎందుకంటే మేము అందుబాటులో ఉంటాము.. దయచేసి గమనించగలరు. ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ భక్తులకు సౌకర్యాలు కల్పించే విధంగా సౌకర్యం కల్పించడమే ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అందుబాటులో ఉంటూ వచ్చే భక్తులకు దీవెనలు ఉండాలని ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతినిత్యం భక్తుల కోసం ఎప్పుడు ఎల్లమ్మ తల్లి దీవెనలు ఉండాలని ఆయన కోరారు

